# మతం

—"శ్రీ చంద్రశ్రీ."

"...హెచ్చుతగ్గుల దొంగకల్పన
చచ్చుసంఘం చచ్చు దేముడు
మాకు వొద్దోయ్-మాకు వొద్దోయ్"

—ఈ జీచైరులో పడుకుని- ముద్దుకృష్ణ రాశిన ఈ పాటను పాడుకుంటున్నా...

అన్నయ్యవచ్చి చేతిలోవున్న 'జ్వాల'ను ఎగర కొట్టుకుపోయి, 'ఇలాంటివన్నీ చదివే- ఇంతిలా అయిపోయాడు చంద్రుడు...'అంటూ ఇంట్లో పితూరీ చేశాడు.

తాను ఏంచదివి బాగుపడ్డాడో!

ఉన్న మాటంటే ఉలుకు ఎక్కువ!!

శుద్ధ కొక్కిరాయి-వేణుగోపాల శతకకర్త...

మహామజాగా ఎక్కిరించాడులే!

అయినా ఏమిటీ- దొంగమతం! మతం పేరుచెప్పి-ఛఛా? వెధవ పనులన్నీ చేస్తున్నారు.

'దేముడు-భక్తి' అన్నమాట లేకుండా శివరాత్రి నాడైనా-గుళ్లోకి వెళ్ళకుండా-లుంగీలు కట్టుకుని శుద్ధ పోకిరీలలాగు ఎలా తిరుగుతున్నారో!...అంటారు.

వీరంతా దేముడిమీద భక్తిఅంటూ- గుళ్లోకి పోయి చేసేవన్నీ ఏం పనులో?...

పైకి-అంతా సి-ఐ-డీ-ల- రకం...

గోష్పాదం సరీగా ఎంతవుందో-దగ్గరకెళ్ళి-రెండు తన్నులు తినైనా- దానిచేత- కొలుచుకుని-పిలకలు ఝాడించుకుంటూ- పూటకుడజను విభూతిపళ్లు పగులగొట్టి- గుళ్ళోకిపోయి- అనువైతే పక్కనున్న ఆడవాళ్లను కాలితో గోకటమేగా!

ఏమిటి- యీ పనులు?...

మనదేశంట:-- పుణ్యభూమిట! ఇక్కట్ట! ఉపనిషన్మధువుట్ట! వాలికాయిట...అంచేత- మనం...?

మన పూర్వులు చాలా గొప్పవాళ్లుట అయితే అయ్యారు...నాకేం?...

మతం చెడుతోంది-చెడుతోంది అని అఘోరిస్తున్న వీళ్లు-ఏం మనుష్యులు?...

'వేదం ప్రామాణికం' అని ఒప్పుకోకపోతేనే కదూ! బౌద్ధుల్ని మనవాళ్లు నాస్తికులన్నది—నేడు లుంగీ ఇత్యాదయః కంటపడితేనే చాలు...

... ... ...

వేదం ప్రమాణమేనాకు మరి...కాని నేను ఈ నాయనమ్మల దృష్టిలో నాస్తికుణ్ని...నాకేం ఇబ్బంది లేదు...

"శ్వభ్యః-శ్వపతి భ్యశ్చవో నమోనమః-కులాలేభ్యః కర్మారేభ్యః-పుంజిష్ఠేభ్యో- నిషాదేభ్యశ్చవో నమోనమః" అని మళ్లీ-

-శివరాత్రినాడు—కార్తీక సోమవారంనాడు- అభిషేకాలు చేస్తారే శివుడికి- ఆ మంత్రార్థం ఏమిటీ?.

నమకంచమకం- కాస్త పురుషసూక్తం చదువుకుంటే వైదిక శిఖామణిగా చలామణీ అవుతున్న వీళ్లు- ఆ నమకం ఏ అర్థాన్ని చెబుతోందో-దాన్ని...అనుష్ఠిస్తారా?... ఉహూఁ...

మాచకమ్మ దగ్గర్నుంచీ-మఠాధిపతిదాకా భగవద్గీత-పేరెత్తితే చాలు—పడి చస్తారే-ఆ భగవద్గీత ఏమ్మంది?...

"విద్యా వినయసంపన్నే-బ్రాహ్మణే గవిహస్తిని-శునిచైవ-శ్వపాకేచ......సమదర్శినః"—అన్న ముక్కకు సమన్వయం ఏమిటీ?...

ఈ అస్పృశ్యతోద్ధారక మహాపురుషులు—డామిట్-వీళ్లేమిటి-సనాతను లేమిటి-అంతా దొంగ వేషాలు...

లోకానికి కళ్లుమూద్దా మనుకుంటూ...తాము కళ్లుమూసుకుని-లోకానికి కళ్లు మూశా మనుకుంటున్నారు...ఇలాంటి వారంతా...

ఉన్న దున్నట్లు-చెబితే-లోకానికి ఇప్పుడు అర్థం కాదు. అబద్ధం-చెబుతూ-అక్రమంగా సంచరించేవాడు. లోకానికి మంచివాడు. నిజంచెప్పినవాడు-ప్రపంచానికి విరోధి...

నలుగురికి నీతులు చెప్పే శాస్త్రుల్లుగారు-గుళ్ళో పురాణం చెప్పినంతసేపూ...శ్రీరంగనీతులు చెప్పి-చెప్పి—చాతుర్వర్ణ్య—అవసరాలన్నీ వెధముండలకు-బూజుపట్టిన మలపసన్యాసులకు చెప్పి- రాత్రికి-గుడి వూడ్చి బాగుచేసేదాని బుజం మీద చెయివేస్తాడే!-

వాణ్ణి ఏమనాలి?... మరి వాడిమతం... వైదికమతం.. ఏమయిందీ?...

తాముచేస్తూవున్న పుధాకోరుతనాల్ని కప్పి పుచ్చటానికి-పంపుచుట్టూ పదిగజాలదాకా పేడనీళ్ళు చల్లి-పన్నెండుసార్లు స్నానంచేసి-కాళ్ళు ఎత్తెత్తి వేసుకుంటూ-వీధుల నేంట పోతూంటేసరా?...వైదికమతం. బూజు పట్టకుండా నిలిచిపోయినట్లేనా?...

-ఈ మధ్య-పాత రంకుల్ని కప్పి పుచ్చటానికి-ఎలక్షన్స్‌లో...కాంగ్రెస్ ప్రచారం చేసినట్లు...

యజ్ఞయాగాదులు చేయించి—రెండుమూడు జిల్లాలలోకల్లా-వైదిక శిఖామణులలో అగ్రేసరుడుగా నిలబడి-శ్రౌతులు-గారు-మడిగట్టుంకుటే-మారేడుకాయ (నస్యానికి) ముట్టుకోకూడదంటాడే-... ఆకాస్నేవు ముక్కు మూసుకుని...యేదోయితరస్త్రీ మీద చెయ్యి వేస్తున్నాడు...అక్కడ నిలిచినట్లేనా వైదికమతం?...

అగ్రహారాల్లో వుండే అవధాన్ల గార్లంతా 'బస్తీ కెళ్ళి పాడైపోయారు బ్రాహ్మలంతా' అంటారు.. ఆ అగ్రహారాల్లోనే-రాత్రి పన్నెండు గంటలకు శివాలయాల్లో జరిగే- ఆఘాయిత్యాలకీ అకృత్యాలకీ-లెక్క వుందా?-

-...మరి వాటి మాటేమిటీ?...

తమ ప్రవర్తనలో వున్న లోటుపాట్లు తాము గమనించకుండా- ఎదటి వాడికి తప్పులు దిద్దబోవటం ఎందుకు?...అలా అంటూంటే- తాము సత్ప్రవర్తకులని అంతా అనుకుంటారనా?...లేక- అలా యోంచటం- ఏమైనా ఘరానా తనమా?...

ఇలాగే?...

రామ? రామ? ఎన్నడైనా వుందా బ్రాహ్మల్లో ఈ హోయేకాలం?...బ్రాహ్మణీకం అంతా తగలెయ్యటానికి- బస్తీలల్లో- బ్రాహ్మలంతా- బర్మా చుట్టలు చుట్టటం నేర్చారు...అంటారు...కొప్పు పెట్టుకుని-మడికచ్చపోసి కట్టు కట్టుకుని- పొద్దుగూకంగానే వింతధోరణీలో వ్యవహరించే సోమి దేవమ్మగారి వల్ల...బ్రాహ్మణీకం బుగ్గి అయిపోకుండా నిలిచిందా?...

ఇంకా!...

మతం పాడు ఏమీ లేదు...ఈ కాలం వాళ్ళకి...కిరస్తాని వాళ్ళ లాగా జుట్లు కట్టూ- ఏర్పడ్డాయి...మెళ్ళో కంఠె వుంటే ఎంత నిండుగా వుంటుందీ?...కాళ్ళకు- గొలుసులు వుంటే- ఎంత నిండు- అది ఏదీ లేదు. కంఠెకు బదులు గొలుసులైనా పెడుతున్నారు కొంతమంది. కాళ్ళకు- ముక్కలకు బొత్తిగా తీసి పారేశారు...అంటూ ఆక్షేపిస్తూ వుంటారు...కొంతమంది అహితాన్నుల భార్యలు...

అయితే వాళ్ళ పూర్వులు పెట్టిన కొప్పు గొలుసులు- మెళ్ళో- పట్టెడను...కాళ్ళకు అందెలు తాము పెట్టారూ?...అదివరకు పెట్టే- అర్థణా కుంకుమ అల్లా- దమ్మిడీలోకి దిగింది...వారి తర్వాత-

కందిబద్ద అంత పెడుతోంటే- వీళ్ళను అనటం ఎందుకు?...

తమ యిష్టప్రకారం అంతా నడవాలంటారు... అలా నడవటానికి వీరి ఖర్మ ఏం కాలిపోయింది?...

తమకు కాకరకాయ కూర ఇష్టమైంది కదా అని తినమంటే- అంతా తింటారా?

... ... ...

పై-పైన వేషాలన్నీ మార్చాలి అని అఘోరించే వాళ్లు మనస్సును మార్చుకోరేం?...

... ... ...

ఎవరో- తెలిసో- తెలియకో- ఏవో కొన్ని ఆచారాలు- ... గుడ్డి ఆచారాలు...నిర్మించారని- శతాంధ్యాః కూపం ప్రవిశన్తి" అన్నట్లు అందరిని అలాగే మనుష్టించమంటే-?...

మనిషిలో వున్న- ప్రతిభ చంపటానికి ఈ ఆచారాలు- దయ్యాలలాగా బయలుదేరి పీల్చి పిప్పి చేస్తున్నాయి- మానవుణ్ణి- ఉగ్గుపాలనుంచి- మతం అని ఆచారమనీ పీడి ప్రాణాలు తీశేస్తారు...పెద్ద వాళ్లు...-పోనీ ఇలా- మతం పాడైపోతోంది అనే ఘరానా మనుష్యులు- ఆ ప్రకారం నడుస్తునారా? అంటే- ముందు మతాన్ని వారే ధ్వంసం చేస్తున్నారు...

తాము అలా మతాన్ని మన్ను చేస్తూ ఇంకొర్ని తమలా నడచుకోమంటే- ఎందుకు నడుకుంటారూ?...


## జగదేకరంభ

జగదేకరంభయన నీమెయే జగదేకరంభ. రంభఅంటే దేహ సౌందర్యముచేతనేగాక శీలసౌందర్యముచే ప్రపంచాన్ని మెప్పించిన నారీరత్నము. చమత్కారమైన కథ.

గ్లేసు ప్రతి 1-కి 0-10-0 తపాలాఖర్చు వేరు:

## మిత్రద్రోహము

తిన్నయింటికి వాసాలెంచు సామెతనుబట్టి యల్లబడిన రసవంతమగు నవల. ఇదివర కిట్టి నవల వెలువడలేదు. అపరాధాన్వేషణము అత్యద్భుతము. గ్లేసు ప్రతి 1-కి 0-8-0

తపాలాఖర్చు ప్రత్యేకము.

ధనలక్ష్మి కంపెని,

సౌకారుపేట, మదరాసు.

## లీల

లేక

## సురేంద్రనగరమణి

రసవంతమగు నవలారాజము

బాలురకు తలితండ్రులయందు భక్తియు, స్త్రీలకు పతియందలి ప్రేమయు, పురుషులకు రాజవిశ్వాసమును యీ గ్రంథపఠనచే యలవడును.

ప్రతి 1-కి రు. 1-0-0

ఆర్యన్ బుక్ డిపో,

19, తాండవరాయ మొదలివీధి, తిరువళ్ళిక్కేణి, మదరాసు.